సాక్షి ప్రకాశం

ఆదివారం । 20 । ఆగస్టు । 2023



మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

మత్స్యకారుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. మత్స్యకారులకు ఆరు చక్రాల వాహనాలు పంపిణీ చేశారు. - IIలో..



జవాబుదారీపాలనే జగనన్న లక్ష్యం

రాష్ట్రంలో జవాబుదారీ పాలన అందించడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. - IIలో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 34/27

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మార్గదర్శిలో మూడో రోజూ సోదాలు



శనివారం రాత్రి ఒంగోలు మార్గదర్శి వద్ద..

ఒంగోలు టౌన్: మార్గదర్శిలో గురువారం నుంచి కొనసాగుతున్న సీఐడీ తనిఖీలు శనివారం నాటికి మూడోరోజుకు చేరాయి. సీఐడీ అధికారులతో పాటుగా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు కూడా సంయుక్తంగా ఫైళ్లను పరిశీలిస్తున్నారు. ఈ తనిఖీల్లో అనేక అవకతవకలను అధికారులు గుర్తించినట్లు సమాచారం. ముఖ్యంగా కస్టమర్ల సంతకాలు లేకుండానే వారిపేరు మీద చిట్లు వేయడం లాంటి అనేక అక్రమాలు సీఐడీ దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది. విచారణలో భాగంగా కొందరు కస్టమర్లకు సీఐడీ అధికారులు ఫోన్లు చేసినప్పుడు మార్గదర్శిలో తాము ఎలాంటి చిట్లు వేయలేదని చెప్పినట్లు తెలుస్తోంది. తమపేరు మీద చిట్లు వేయడం గురించి తెలిసి వారు విస్మయానికి గురైనట్లు సమాచారం. వీటితో పాటుగా చిట్లకు సంబంధించిన డబ్బులను సకాలంలో కస్టమర్లకు చెల్లించకుండా దారి మళ్లించినట్లు అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా గురువారం నుంచి మార్గదర్శి లోపల సీఐడీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తుంటే మార్గదర్శి బయట ఈనాడు, ఈటీవీ సిబ్బంది పడికాపులు కాస్తున్న విషయం తెలిసిందే. మొదటిరోజు ఒంగోలుకు చెందిన ఈనాడు విలేకరులు మొత్తం మార్గదర్శి వద్ద మోహరించిన పరిస్థితి కనిపించింది. రెండోరోజు పొదిలి, మూడోరోజు అద్దంకి నుంచి ఈనాడు, ఈటీవీ విలేకరులను పిలిపించి ఒంగోలు మార్గదర్శి వద్ద డ్యూటీలు వేశారు. ఈ విషయంలో జర్నలిస్టు సంఘాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈనాడు సిబ్బంది సైతం మాకు ఇదేం పని అని చిరాకు పడుతున్నారు.

52 మంది ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థినులకు ఉద్యోగాలు

ఒంగోలు: స్థానిక డీఎస్ మహిళా ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి చెందిన 52 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. గుంటూరులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ఆవరణలో జరిగిన మెగా జాబ్ మేళాకు ఒంగోలు డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ విద్యార్థినులు ఐదుగురు హాజరయ్యారు. వారిలో 52 మంది ఉద్యోగాలకు ఎంపికవడంతో విద్యార్థినులను కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి అభినందించారు.

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రవేశాల గడువు పొడిగింపు

ఒంగోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ బీఏ/బీకాం/బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశం కోసం గడువును పొడిగించినట్లు ఒంగోలు రీజినల్ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ ఎం.శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో ప్రవేశానికి ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంటర్ ఓపెన్ స్కూల్ ద్వారా ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. తాజాగా దరఖాస్తు గడువును సెప్టెంబర్ 5వ తేదీ వరకు పొడిగించారన్నారు. రూ.100ల అపరాధ రుసుముతో సెప్టెంబర్ 20వ తేదీ వరకు, రూ.200ల అపరాధ రుసుముతో సెప్టెంబర్ 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 7382929613 సంప్రదించాలన్నారు.

మృత్యునాదం



మృతదేహాల వద్ద విలపిస్తున్న బంధువులు

- అర్ధరాత్రి జాతీయ రహదారిపై ప్రమాదం
- సాయం కోసం మిన్నంటిన ఆర్తనాదాలు
- ప్రాణాలు విడిచిన ముగ్గురు యువకులు
- శుభకార్యానికి వెళ్లి వస్తుండగా ఘటన
- మూడు కుటుంబాల్లో విషాదం

స్నేహితుడి ఇంటి శుభకార్యంలో సంతోషంగా గడిపారు. అర్ధరాత్రి వేళ.. వెళ్లొద్దని వారించినా వినలేదు. ఒకే బైక్ పై బయలుదేరిన ఆ ముగ్గురు స్నేహితులను మృత్యువు కాటేసింది.
పది నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనుకుంటే అంతలోనే అనంత లోకాలకు వెళ్లిపోయారు.
అర్ధరాత్రి ఏమి జరిగిందో తెలుసుకునేలోపు వారిని మృత్యువు కాటేసింది. బేల్దారు పనులు చేసుకుంటూ ఆసరాగా ఉన్న వారు విగత జీవులుగా మారడంతో కన్నవారు దుఃఖసాగరంలో మునిగిపోయారు. చేతికి అందివచ్చిన కొడుకులను మృత్యువు కబళించడంతో పేదింట పెనువిషాదం అలుముకుంది.





సంఘటనా స్థలంలో పడివున్న యువకుల మృతదేహాలు

మార్కాపురం/తర్లుపాడు/కొనకనమిట్ల: అర్ధరాత్రి వేళ జాతీయ రహదారి రక్తసిక్తమైంది. శుక్రవారం అర్ధరాత్రి దాటి రెండు గంటలు కావస్తోంది. మార్కాపురంలోని కస్తూరిబా స్కూల్ దాటిన కొంత దూరంలో ఒక్కసారిగా పెద్ద శబ్దం.. ఆ సమయంలో మార్కాపురం ఒంగోలు జాతీయ రహదారిపై ఒకటీ అర వాహనాలు వెళ్తున్నాయి. ఒక్కసారిగా ఆర్తనాదాలు వినిపించాయి. ముగ్గురు యువకులు రక్తపు మడుగుల్లో పడిఉన్నారు. కాపాడండి అంటూ వారి చేస్తున్న అరుపులు సమీపంలో ఉన్న కలుజువ్వలపాడు ఎస్సీ కాలనీ వాసులకు వినిపించటంతో నిద్రమత్తు వదిలించుకుని పరుగు పరుగున రోడ్డుపైకి వచ్చారు. అప్పటికే ముగ్గురు యువకులు మృత్యువాత పడ్డారు. నెల్లూరు జిల్లా సంగం నుంచి ఇసుక లోడుతో వస్తున్న లారీ మార్కాపురం నుంచి అంబాపురానికి టూ వీలర్‌పై వెళుతున్న ముగ్గురు యువకులను ఢీకొనటంతో అక్కడికక్కడే వారు మృతి చెందారు. దీంతో మృతుల స్వగ్రామాలైన కొనకనమిట్ల మండలం అంబాపురం, పొదిలి మండలం సలకనూతల గ్రామాల్లో విషాదం నెలకొంది. అయితే అర్ధరాత్రి సమయంలో వివరాలు తెలిసే అవకాశం కనిపించలేదు. వెంటనే స్థానికులు పోలీసులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. హుటాహుటిన తర్లుపాడు ఎస్సై సుధాకర్, పొదిలి సీఐ రాఘవేంద్ర అర్ధగంట వ్యవధిలోనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. పరిస్థితి భయానకంగా ఉంది. మృతదేహాలు రోడ్డుకు అడ్డంగా ఉండటంతో ట్రాఫిక్ ఆగిపోయింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి మృతుల వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లు, ఆధార్‌కార్డుల ఆధారంగా కొనకనమిట్ల మండలం అంబవరం ఎస్సీ కాలనీకి చెందిన జమ్మలమూడి శాంసన్ (20), పెరిక వినోద్‌కుమార్ (20), పొదిలి మండలం సలకనూతలకు చెందిన ఇండ్ల నాని (17)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. 3 గంటల కల్లా కుటుంబ

> **ఇలా జరుగుతుందని అనుకోలేదు**
>
> అర్ధరాత్రి సమయంలో పోలీసులు ఫోన్ చేశారు. చిన్న ప్రమాదం జరిగిందని చెప్పారు. తీరా ఇక్కడికి వస్తే నా కుమారుడు నాని విగతజీవుడై కనిపించాడు. ఇలా జరుగుతుందని కలలో కూడా అనుకోలేదు. దేవుడు ఇంత అన్యాయం చేస్తాడని అనుకోలేదు. నాకు నా కుటుంబానికి దిక్కెవరయ్యా.
>
> – షద్రక్, నాని తండ్రి



జిల్లా వైద్యశాలలో విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులు

సభ్యులు, బంధుమిత్రులు సంఘటన స్థలానికి చేరుకుని తమ పిల్లల మృతదేహాలను చూసి తల్లడిల్లారు. అప్పటి వరకు మార్కాపురం మండలంలోని రాజుపాలెం గ్రామంలో జరిగిన ఒక శుభకార్యక్రమంలో పాల్గొని విశేషాలు చెప్పి ఇళ్లకు బయలు దేరుతున్నామని ఫోన్‌లో చెప్పారు. ఇంతలోనే రోడ్డుపై మృతదేహాలుగా కనిపించటాన్ని జీర్ణించుకోలేకపోయారు.

కంటతడి పెడుతున్న అంబాపురం ఎస్సీ కాలనీ..

కొనకనమిట్ల మండలం వాగుమడుగు పంచాయతీ అంబాపురం, అంబాపురం ఎస్సీ కాలనీకి చెందిన పెరికె చినకోటయ్య కుమారుడు రాజేష్‌కు మార్కాపురం మండలం రాజుపాలెంలో వివాహం కుదిరింది. వివాహం నిమిత్తం జరిగే పప్పుభోజనాలకు చినకోటయ్య బంధువులు శుక్రవారం రాజుపాలెం వెళ్లారు. వారితో పాటు ముగ్గురు యువకులు పెరికె వినోద్, జమ్మలమూడి వీరేంద్ర, నాని మోటార్ సైకిల్‌పై వెళ్లారు. రాత్రి అందరూ సంతోషంగా వివాహానికి సంబంధించిన వేడుకల్లో పాల్గొన్నారు. తిరిగి అంబాపురం ఎస్సీ కాలనీకి బయలు దేరగా మార్గమధ్యంలో మరో పది నిమిషాల్లో ఇంటికి చేరతారనగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బేల్దారి పనులు చేస్తూ కుటుంబాలకు ఆర్థికంగా తోడుగా ఉండే యుక్త వయసు వచ్చిన యువకులు మృత్యువాత పడటంతో మృతుల కుటుంబాలతో పాటు ఎస్సీ కాలనీలో విషాదం చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాలను పరిశీలించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.

హెల్మెట్ పెట్టుకుంటే బాగుండేది

హెల్మెట్ పెట్టుకుని ప్రయాణించి ఉంటే ముగ్గురూ ప్రాణాలతో ఉండేవారని సంఘటన స్థలాన్ని చూసిన వారు అభిప్రాయపడ్డారు. పోలీసులు ఎంత అవగాహన కల్పించినా వాహనదారులు హెల్మెట్‌లు పెట్టుకోకుండానే ప్రయాణిస్తూ ప్రాణాలు కోల్పోతున్నారు.

ఇంత రాత్రి వద్దన్నానయ్యా

''నా కుమారుడు వినోద్‌కుమార్ అర్ధరాత్రి ఫోన్ చేసి విశేషాలు చెప్పి బండిమీద నేను, శాంసన్, నాని కలిసి ఇంటికొస్తున్నామని చెప్పాడు. ఇంత రాత్రి వద్దని చెప్పినా వినకుండా వచ్చి ఈలోకాన్నే వదిలివెళ్లాడంటూ'' వినోద్‌కుమార్ తండ్రి పెద్దకోటయ్య గుండెలవిసేలా రోదించారు. పెద్ద కోటయ్యకు వినోద్‌కుమార్‌తో పాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఒక్కడే కుమారుడు కావటంతో కుటుంబ సభ్యుల ఆశలన్నీ అతనిపైనే పెంచుకున్నారు. తన జీవితం చివరి దశలో ఆదుకుంటాడని భావిస్తే దేవుడు తమ కళ్ల ఎదుటే తమ కుమారుడిని తీసుకెళ్లాడని కన్నీటిపర్యంతమయ్యాడు.

శాంసన్ ఒక్కసారి చూడరా..

అరె శాంసన్ ఒక్కసారి మమ్మల్ని చూడరా అంటూ కుమారుడి మృతదేహాన్ని పట్టుకుని శాంసన్ తల్లిదండ్రులు దావీదు, బుజ్జమ్మ ఎడ్చిన తీరు అక్కడ ఉన్న ప్రతిఒక్కరినీ కంటతడి పెట్టించింది. ఒక్కసారి మాట్లాడతానని తల్లిదండ్రులు తమ కుమారుడి గడ్డాన్ని పట్టుకుని వేడుకుంటుంటే ఆ సన్నివేశం చూసిన ప్రతి ఒక్కరూ ఆవేదన చెందారు.

8 గంటల పాటు రాస్తారోకో

మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని దళిత సంఘాలతో పాటు గ్రామ సర్పంచ్ శిఖామణి సోదరుడు ఆధ్వర్యంలో ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. దీంతో ఒంగోలు–మార్కాపురం రహదారికి అటుఇటు 10 కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ట్రాఫిక్‌ను డైవర్షన్ చేశారు.

నగర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు..

- మౌలిక వసతుల కల్పనపైనే ప్రత్యేక దృష్టి
- ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి



గోపాలనగర్‌లో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి చెప్పారు. నగరంలోని 5వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బాలినేని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్ నగర్ రెండో వార్డు సచివాలయం పరిధిలోని గోరంట్ల కాంప్లెక్స్ వెనుక వైపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. గోపాల్ నగర్ ఒకటోలైన్‌లో ఇంటింటికీ తిరిగారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందుతున్న తీరును స్వయంగా బాలినేని అడిగి తెలుసుకున్నారు. ఒంగోలు నగరంతో పాటు నియోజకవర్గంలోని అన్ని సమస్యలను పరిష్కరించటమే లక్ష్యంగా చేసుకొని ముందుకు సాగుతున్నామన్నారు. ప్రధానంగా ఒంగోలు నగరంలోని ప్రజలకు మౌలిక వసతుల కల్పనపైనే ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. నగరంలో వేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అందుకే ధైర్యంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై ఆరా తీస్తున్నామన్నారు. గోపాల్ నగర్‌లో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టామని, ఇంకా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, 5వ డివిజన్ కార్పొరేటర్ ఎండేటి పద్మావతి రంగారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కఠారి శంకర్, గంటా రామానాయుడు, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ కొఠారి రామచంద్రరావు, మహిళా విభాగం వైఎస్సార్ సీపీ జిల్లా పార్టీ అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, కార్పొరేటర్లు చల్లా తిరుమలరావు, బొమ్మినేని మురళి, 5వ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్.సత్య నారాయణ రెడ్డి, జమ్ము శ్రీకాంత్, తాళ్లపాలెం శ్రీను (కొల్లూరు), వాకా తిరుమల, పి.మోహన్ రావు, బొట్ల సుబ్బారావు, ఆసోది విజయలక్ష్మి, ఎస్‌కే.ఖుద్దూస్, రామిశెట్టి హరి, ఆవుల సురేంద్ర, గొల్లపోలు కృష్ణ, జాజుల కృష్ణ, రావులపల్లి శ్రీకాంత్, కఠారి సురేష్, మిరియం సుబ్బులు, పాట్టేళ్ళ నాగేశ్వర రావు, సాదం విజయలక్ష్మి, దాసరి అమ్మన్న, మద్దసాని సుబ్బారావు, మిరియం వెంకటేశ్వర్లు, మోటుపల్లి మణికంఠ, ఏ.శ్రీరామ్, కే.శ్రీనివాస్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పంచాయతీ పోరు

- ఒక సర్పంచ్, 15 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నిక
- సకాలంలో కౌంటింగ్ పూర్తి
- విజేతలను ప్రకటించిన జిల్లా అదనపు ఎన్నికల అధికారి



టంగుటూరు మండలం పొందూరులో ఓట్లు లెక్కిస్తున్న కౌంటింగ్ సిబ్బంది

ఒంగోలు అర్బన్: జిల్లాలో శనివారం జరిగిన పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు వివిధ కారణాలతో ఏర్పడిన ఖాళీలు భర్తీ చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించింది. జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా అదనపు ఎన్నికల అధికారి నారాయణ రెడ్డి పంచాయతీ ఎన్నికలను పక్కాగా నిర్వహించారు. జిల్లాలో 2 సర్పంచ్ స్థానాలకు, 63 వార్డు సభ్యుల స్థానాల్లో ఖాళీలు ఏర్పడటంతో వాటికి ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. వీటిలో 1 సర్పంచ్ స్థానం, 47 వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. అయితే ఒక వార్డు స్థానానికి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. దీంతో మిగిలిన 1 సర్పంచ్ స్థానం, 15 వార్డు సభ్యులకు శనివారం పోలింగ్ నిర్వహించి కౌంటింగ్ పూర్తి చేసి అభ్యర్థులను ప్రకటించారు. ఉదయం 8.30 గంటలకు 12.75 శాతం, 10.30 గంటలకు 41.63 శాతం, మధ్యాహ్నం 12.30 గంటలకు 63.15 శాతం పోలింగ్ నమోదైంది. సింగరాయకొండ మండలం పాకల సర్పంచ్ స్థానంలో ఎస్ చంద్రశేఖర్ రావు గెలుపొందారు.

గెలుపొందిన వార్డు సభ్యులు

మండలం	పంచాయతీ (వార్డు నెంబర్)	గెలుపొందిన అభ్యర్థి
బేస్తవారిపేట	ఖాజీపురం (3వ వార్డు)	వినుకొండ బాలస్వామి
టంగుటూరు	పొందూరు (1)	పిడికిటి శ్రీనాథ్
వెలిగండ్ల	పాండువ (4)	మరియమ్మ కమ్మురికుంట
సీఎస్‌పురం	చెన్నపునాయునిపల్లి (6)	యనమల వెంకటనాగరాజు
పెదచెర్లోపల్లి	గుంటుపల్లి (3)	వడ్డే చిన్నమ్మ
పొన్నలూరు	ముప్పాళ్ల (8)	పిగిలి మాల్యాద్రి
చీమకుర్తి	మంచికలపాడు (1)	బండార్‌సింగారి బాలాజీ సింగ్
రాచర్ల	రాచర్ల (6)	షేక్ హజార్‌బీ
కనిగిరి	గురవాజీపేట (2)	రెక్కల సుశీల
కొత్తపట్నం	అల్లూరు (4)	మేక కిరణ్
పొదిలి	కొండాయపాలెం (3)	జొన్నలగడ్డ నాగమ్మ
ముండ్లమూరు	పలసపుగల్లు (10)	పసిపోగు మౌనిక
సింగరాయకొండ	సింగరాయకొండ (16)	షేక్ సబీర
సింగరాయకొండ	మూలగుంటపాడు (10)	అంబటి శ్రీనివాసరావు
పెద్దారవీడు	కలనూతల (6)	బత్తుల శ్రీనివాసులు

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత తదితరులు

ఒంగోలు సిటీ: జర్నలిస్టుల సంక్షేమానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం మీడియా కెమెరామెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవానికి ముఖ్య అతిథిగా బాలినేని శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో చేపట్టిన రక్తదాన శిబిరాన్ని బాలినేని ప్రారంభించారు. ఈ రక్తదాన శిబిరంలో రైస్ ఇంజినీరింగ్ కాలేజీ, హర్షిణి కాలేజీ విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. వీరికి బాలినేని శ్రీనివాసరెడ్డి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మీడియా కెమెరామెన్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ ఇఫ్తేకర్ బాషా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శిథిలావస్థకు చేరిన మీడియా కెమెరామెన్ అసోసియేషన్ భవనాన్ని నూతనంగా నిర్మించేందుకు బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని, కరోనా కష్టకాలంలో ఎంతో మంది జర్నలిస్టులను బాలినేని ఆదుకున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. విలువలతో కూడిన కథనాలు ప్రచురించేలా జర్నలిస్టులు నడుచుకోవాలని సూచించారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు. అసోసియేషన్ సభ్యులు ముఖ్య అతిథిగా పాల్గొన్న బాలినేని శ్రీనివాసరెడ్డిని శాలువ, గజమాలతో ఘనంగా సన్మానించారు. నగర మేయర్ గంగాడ సుజాత, స్థానిక కార్పొరేటర్ యనమల నాగరాజు, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పి.ప్రకాష్‌బాబు శాలువ, మెమొంటోలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంసీఏ పూర్వపు అధ్యక్షుడు, సీనియర్ ఫొటోగ్రాఫర్ వి.నాగేశ్వరరావు, ఎం.ప్రసాద్, ఎ.రాజశేఖర్, ఇలియాజ్, బాబు, అసోసియేషన్ సభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హై కోర్టు జడ్జిని కలిసిన ఎస్పీ



హైకోర్టు న్యాయమూర్తి బీఎస్ భానుమతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ

ఒంగోలు టౌన్: హై కోర్టు జడ్జి, ప్రకాశం జిల్లా కోర్టు అడ్మినిస్ట్రేటివ్ జడ్జి బి.ఎస్. భానుమతి శనివారం ఒంగోలుకు వచ్చారు. ఎన్ఎస్పీ గెస్ట్ హౌస్ వద్ద జడ్జిని ఎస్పీ మలికా గర్గ్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

పాము కాటుకు రైతు మృతి



గోపిరెడ్డి రమణారెడ్డి (ఫైల్)

మద్దిపూడి: పాముకాటుకు రైతు బలైన సంఘటన వల్లాయపాలెంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గోపిరెడ్డి రమణారెడ్డి (49) గ్రామ శివారులోని చెరువుకట్ట కింద వరి సాగు చేసుకునేందుకు రెండురోజుల క్రితం పొలం వెళ్లాడు. వరికయ్య తిరిగేసే క్రమంలో పాము రమణారెడ్డి కుడికాలుపై కాటు వేసింది. 108 వాహనంలో పొదిలి అనంతరం ఒంగోలులోని కిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రమణారెడ్డి శనివారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఎస్ఐ శివబసవరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు రమణారెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడున్నారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

సింగరాయకొండ: మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీ పొలాల్లో పేకాట కేంద్రంపై సెబ్ ఎస్సై దయాకర్ ఆధ్వర్యంలో దాడులు జరిపారు. ఈ దాడిలో ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 1,55,500 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. నగదుతో పాటు ముగ్గురిని స్థానిక పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేసి కోర్టుకు పరచనున్నట్లు సెబ్ ఎస్సై వివరించారు.

నేడు యోగాసన జిల్లా జట్ల ఎంపిక

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లా యోగాసన క్రీడాకారుల ఎంపిక ఆదివారం స్థానిక గద్దలగుంటలోని పింగళి కోదండరామయ్య సంస్కృతాంధ్ర పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు యోగ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డీఎల్ కిరణ్మయి సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 8 ఏళ్ల నుంచి 45 సంవత్సరాల వయస్సు వరకు వివిధ కేటగిరీలలో బాలబాలికలు, యువతీ యువకులు, స్త్రీ పురుషులు పాల్గొనవచ్చన్నారు. ఆసక్తిగలవారు తమ పేర్లను 9030965970 నంబర్‌కు తెలియజేయాలన్నారు. హాజరుకాదలుచుకున్న అభ్యర్థులు తమ వెంట తప్పనిసరిగా వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డును తీసుకురావాలన్నారు.

చేపల వేటకు వెళ్లి.. శవమై వచ్చాడు

కారంచేడు: చేపలు పట్టుకోవడం కోసం కొమ్మమూరు కాలువ వద్దకు వెళ్లిన కొడుకు విగతజీవిగా ఇంటికి రావడంతో తల్లిదండ్రుల రోదనలు చీరాల కొత్తపాలెం ప్రాంతం మిన్నంటాయి. చీరాల కొత్తపాలెం యానాది కాలనీకి చెందిన బాలసుబ్రహ్మణ్యం (19) శనివారం తన స్నేహితులతో కలిసి మండలంలోని సర్ల గ్రామం వద్ద కొమ్మమూరు కాలువ వద్దకు వెళ్లారు. కొద్ది సేపు చేపలు పట్టిన తరువాత కాలువలో ఈత కొట్టేందుకు దిగాడు. ఈత కొడుతుండగా కొన్ని పశువులు కాలువలోకి రావడాన్ని గమనించాడు. బాలసుబ్రహ్మణ్యం కట్ట మీదకు వెళ్లేందుకు అటువైపు వెళ్తుండగా ఉధృతంగా ప్రవహిస్తున్న నీటి వేగానికి కొట్టుకుపోయాడు. అక్కడే ఉన్న తన స్నేహితులు, గ్రామస్తులు గాలింపు చర్యలు చేపట్టారు. కొద్ది సేపటికే శవంగా మారాడు. స్నేహితుని మృతదేహాన్ని బయటకు తీశారు. విషయం తెలిసిన కారంచేడు ఎస్సై శ్రీనివాసరావు ఘటనా స్థలం వద్దకు వెళ్లి మృతదేహాన్ని చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడికి తల్లిదండ్రులతో పాటు వివాహాలు జరిగిన ఇద్దరు అక్కలు, ఒక అన్నయ్య ఉన్నారు. మృతుడు అవివాహితుడు.

ఉద్యోగాల పేరుతో మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

చీరాల: బ్యాక్‌లాగ్ పోస్టులు ఇప్పిస్తానని ఎస్సీ నిరుద్యోగ యువతను నమ్మించి లక్షల రూపాయలు వసూలు చేసిన వ్యక్తిని శనివారం చీరాల రూరల్ ఈపూరుపాలెం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చీరాల రూరల్ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ఆనందపేటకు చెందిన యాతం క్రాంతి అనే వ్యక్తి ఎస్సీ నిరుద్యోగ యువతకు బ్యాక్‌లాగ్ పోస్టులు ఇప్పిస్తామని చెప్పి మోసం చేశాడు. ఉద్యోగాల పేరిట మరికొందరి వద్ద నుంచి లక్షల రూపాయలు వసూలు చేశాడన్నారు. అందులో భాగంగా చీరాల రూరల్ మండలం వాడరేవుకు చెందిన రూబేన్ కుమారుడికి బ్యాక్‌లాగ్ పోస్టు ఇప్పిస్తానని చెప్పడంతో అతడు రూ.4.50 లక్షలు విడతల వారీగా ఇచ్చాడన్నారు. రోజులు గడుస్తున్నా ఉద్యోగం రాకపోయేసరికి మోసపోయామని గ్రహించి ఒత్తిడి చేయడంతో ఫోర్జరీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చి మోసం చేశాడన్నారు. దీంతో తనను ఉద్యోగాల పేరిట మోసం చేశాడంటూ ఈపూరుపాలెం రూరల్ పోలీసులకు, ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. యాతం క్రాంతిని శనివారం కోర్టులో హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి



మత్స్యకార లబ్ధిదారులకు ఆరు చక్రాల వాహనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత, జేడీ చంద్రశేఖరరెడ్డి తదితరులు

- ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి
- ఇద్దరు మత్స్యకార లబ్ధిదారులకు ఆరు చక్రాల వాహనాలు పంపిణీ
- ఒక్కొక్కరికి రూ.7,40,022 సబ్సిడీ

ఒంగోలు సబర్బన్: మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా ఇద్దరు లబ్ధిదారులకు ఆరు చక్రాల వాహనాలను శనివారం ఆయన చేతుల మీదుగా అందజేశారు. స్థానిక ప్రకాశం భవన్ ఎదురుగా ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బాలినేని మాట్లాడుతూ మత్స్య సంపద రవాణా కోసం 40 శాతం సబ్సిడీతో కూడిన వాహనాలను లబ్ధిదారులకు అందించటం జరిగిందన్నారు. ఒక్కో యూనిట్ విలువ రూ.18,50,054 కాగా, సబ్సిడీ రూపంలో ఒక్కొక్కరికి రూ.7,40,022 చొప్పున లబ్ధిచేకూరిందన్నారు. రెండు వాహనాలకు కలిపి రూ.14,80,044 ప్రయోజనం చేకూరిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని బాలినేని వివరించారు. మత్స్యకార భరోసాతో పాటు అనేక రకాల సంక్షేమ పథకాలతో మత్స్యకారులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఆవుల చంద్రశేఖరరెడ్డి, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, మత్స్యశాఖ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సృజనాత్మకతతో అద్భుతాలు

- ఫొటోగ్రఫీ క్రియేటివ్ జాబ్
- ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవంలో కలెక్టర్ దినేష్‌కుమార్
- పాల్గొన్న ఎస్పీ మలికాగర్గ్



శ్రీకళానిలయం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: సృజనాత్మకతతో అద్భుతాలు ఆవిష్కరించవచ్చని ఫొటోగ్రాఫర్ నిరూపించారని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. ఒంగోలు కళానిలయం ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని స్థానిక అంబేడ్కర్ భవనంలో శనివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో కలెక్టర్‌తో పాటు ఎస్పీ మలికాగర్గ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫొటోగ్రఫీ ఎంతో క్రియేటివిటీ ఉన్న జాబ్ అని అన్నారు. ప్రతి మనిషిలోను సృజనాత్మకత ఉంటుందని, దాన్ని సరైన దిశలో వినియోగిస్తే అద్భుతాలు ఆవిష్కృతం అవుతాయన్నారు. ఫొటోగ్రాఫర్స్ టెక్నాలజీతో పోటీ పడాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ఒత్తిడితో కూడిన నేటి జీవన విధానంలో మానసిక ప్రశాంతత కోసం ఫొటోగ్రఫీని అభిరుచిగా మార్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కలెక్టర్, ఎస్పీలు వీక్షించారు. ఫొటోగ్రఫీ రంగంలో ఉత్తమ సేవలకు సీనియర్ ఫొటోగ్రాఫర్ తాడి రామచంద్రరావు, మరో ఫొటోగ్రాఫర్ కే శ్రీనివాసులును సత్కరించారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఫొటో కంపిటేషన్‌లో విజేతలుగా నిలిచిన వారిని నగదు బహుమతి, జ్ఞాపిక, శాలువాలతో సత్కరించారు. రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి పొందిన చినగంజాంకు చెందిన ఫొటోగ్రాఫర్ ఆర్ సీతారామయ్యకు రూ.20 వేలు, కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం నేదునూరుకు చెందిన వీకేఆర్ఎస్ శర్మకు రూ.10 వేలు, వేటపాలేనికి చెందిన బాలజీమోహన్ కృష్ణకు రూ.5 వేలు నగదు బహుమతి అందజేశారు. వీరితో పాటు మరో ఆరుగురికి కన్సొలేషన్ బహుమతులు దక్కాయి. దీనిలో క్విస్ ఇంజినీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ హనుమంతరావు, జాహ్నవి నీట్ అకాడమీ డైరెక్టర్ పీ జనార్ధన్, రోటరీ క్లబ్ అధ్యక్షులు గోపాలకృష్ణ, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ జీవన్, ఐఎంఏ అధ్యక్షుడు జాలాది మణిబాబు, అపెక్స్ స్కూల్ డైరెక్టర్ శివారెడ్డి, బీఎంఆర్ గోల్డ్ సాప్ అధినేత అర్జున్‌రావు, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, సూర్య నాగేశ్వరరావు, కోటయ్య, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల ప్రాముఖ్యతను గుర్తించాలి



మ్యాచ్‌లో తలపడుతున్న ప్రకాశం - పశ్చిమ గోదావరి జిల్లా జట్లు

- రాష్ట్రస్థాయి పురుషుల హ్యాండ్‌బాల్ పోటీల ప్రారంభంలో స్టెప్ సీఈవో లోకేశ్వరరావు

ఒంగోలు: క్రీడల ప్రాముఖ్యతను ప్రతిఒక్కరూ గుర్తించాలని స్టెప్ సీఈవో లోకేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక మినీ స్టేడియంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి పురుషుల హ్యాండ్‌బాల్ పోటీలను శనివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ప్రాముఖ్యతను ప్రపంచం మొత్తం గుర్తించిందని, ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరిలో చిన్నతనం నుంచే క్రీడాసక్తి పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆడుదాం ఆంధ్రా అనే ప్రత్యేక కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో క్రీడలపై ఉత్సాహం నింపేందుకు కృషి చేస్తోందని తెలిపారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ అన్ని క్రీడా సంఘాలు క్రీడాకారులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పి.నరసింహారావు మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన జరగకముందు రాష్ట్రంలో 13 జిల్లాలు ఉండేవని, తద్వారా రాష్ట్రస్థాయి పోటీల్లో 13 జట్లు పాల్గొనేవని అన్నారు. అయితే, ఇప్పుడు కూడా 13 జట్లే టోర్నమెంట్‌కు రావడం ఆనందంగా ఉందన్నారు. రెండు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయన్నారు. మరో అతిథి, జిల్లా చీఫ్ కోచ్ గుంటి రాజరాజేశ్వరి మాట్లాడుతూ క్రీడాస్ఫూర్తితో గెలుపుకోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. హ్యాండ్‌బాల్‌కు ప్రకాశం జిల్లాలో మంచి పేరుందని తెలిపారు. ఎంతోమంది క్రీడాకారులను అందించిన చరిత్ర జిల్లాకు ఉందన్నారు. ప్రతి జిల్లా జట్టు వారి సామర్థ్యాలను చాటుతూ వారి జిల్లాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. తొలి మ్యాచ్ పశ్చిమగోదావరి–ప్రకాశం జట్ల మధ్య జరగ్గా పశ్చిమగోదావరి జిల్లా జట్టు 2 గోల్స్ తేడాతో ప్రకాశం జట్టుపై విజయం సాధించింది. కార్యక్రమంలో పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.విజయ్‌కుమార్, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కె.వనజ, జాతీయ క్రీడాకారులు సత్యం, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీలు ఆదివారం ముగియనున్నాయి.

అనుమానాస్పద స్థితిలో లారీ డ్రైవర్ మృతి



లారీ డ్రైవర్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్సై రమేష్‌కృష్ణ, హైవే పెట్రోలింగ్ పోలీసులు

మద్దిపాడు: తమిళనాడుకు చెందిన లారీ డ్రైవర్ లారీలోనే అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన సంఘటన జాతీయ రహదారిపై మద్దిపాడు సమీపంలోని కొష్టాల సెంటర్ వద్ద శనివారం ఉదయం చోటుచేసుకుంది. తమిళనాడుకు చెందిన ముత్తుస్వామి కుమార్ (54) గుంటూరు నుంచి చెన్నై సమీపంలోని ఈ రోడ్డుకు లోడు తీసుకుని వెళ్తూ శుక్రవారం రాత్రి కొష్టాల సెంటర్ సమీపంలో రోడ్డు మార్జిన్‌లో లారీ ఆపి నిద్రించాడు. శనివారం ఉదయం 10 గంటల సమయంలో లారీ ఆగి ఉండటాన్ని గమనించిన హైవే పెట్రోలింగ్ పోలీసులు తనిఖీ చేయగా డ్రైవర్ మృతి చెంది ఉన్నాడు. దీంతో మద్దిపాడు పోలీసులకు సమాచారం అందించగా ఏఎస్సై రమేష్‌కృష్ణ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మృతుని బంధువులకు సమాచారం అందించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జవాబుదారీ పాలనే జగనన్న లక్ష్యం



లబ్ధిదారులతో మంత్రి ఆదిమూలపు సురేష్


యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు జవాబుదారి పాలన అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని, దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదలను ఆదుకుంటున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. శనివారం మొగుళ్లపల్లి సచివాలయం పరిధిలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత నవరత్నాల పథకాన్ని అమలు చేస్తున్నారని, గతంలో ఎన్నడూ లేని విధంగా పథకాల అమలు గురించి క్యాలెండర్ విడుదల చేసి కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. పేద పిల్లలు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిష్టించాలన్న ఉద్దేశంతో జగనన్న ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది, ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారని, విదేశాలకు వెళ్లి చదువులు అభ్యసించే విద్యార్థులకు రూ. 1కోటి వరకు ఆర్థిక సహాయం అందిస్తున్నారన్నారు. ధనవంతుల పిల్లలే విద్యను అభ్యసించాలని, కార్పొరేట్ స్కూళ్లకు వంతపాడుతూ పచ్చనేతలు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం చదువులను అడ్డుకోవటానికి ప్రయత్నించారని విమర్శించారు. గత 4 సంవత్సరాల కాలంలో సంక్షేమ పథకాల ద్వారా రూ. 7 లక్షలకు పైబడి లబ్ధి పొందిన పేదలున్నారని, ఇంకా ప్రజలకు ఏమైనా అవసరాలు ఉంటాయన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా తెలుసుకుంటున్నారన్నారు. ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు సక్రమంగా అందివ్వాలన్న ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెడితే వారిని పార్టీ వ్యవహారాలకు ఉపయోగించుకుంటున్నారని పచ్చనేతలు దుర్మార్గపు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఇంకా మెరుగైన సేవలు అందించేందుకు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు తమ గడపల వద్దకు వస్తున్నారని, వారికి తమ సమస్యలు ఏమైనా ఉంటే చెప్పి పరిష్కరించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే తిరిగి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

ఓటు బ్యాంకుగా దళితులు

టీడీపీ పాలనలో దళితులను ఓటు బ్యాంకుగా వాడుకోవడంతోపాటు వారిపట్ల నీచంగా ప్రవర్తించారని మంత్రి విమర్శించారు. దళితులుగా పుట్టాలని ఎవరు అనుకుంటారన్న టీడీపీ పెద్ద మనిషి లాంటి పాలనలో దళితులు హేయమైన బతుకులు వెళ్లదీశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు సుదూర పాదయాత్రలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల బాధలు తెలుసుకున్న జగనన్న అధికారంలోకి వచ్చిన వెంటనే నవరత్నాల పథకాలను ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు పరిచారన్నారు. దళిత అక్కాచెల్లెమ్మలకు రూ. 50వేల కోట్లు బదలీ చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని, నవరత్నాల పథకాల్లో 50 శాతం బడుగు వర్గాలకు అందేవిధంగా చర్యలు తీసుకున్నారని తెలిపారు. విజయవాడలోని 18 ఎకరాల ఖరీదైన స్వరాజ్ మైదానాన్ని గత టీడీపీ పాలకులు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలనుకున్నారని, అటువంటి మైదానంలో 3 వందల కోట్ల రూపాయలతో 125 అడుగుల ఎత్తు బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేస్తున్నారన్నారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రాం అడుగు జాడల్లో నడుస్తూ రాష్ట్రంలో సామాజిక న్యాయాన్ని చేసి చూపిస్తున్న ఘనత సీఎంకు దక్కుతుందని చెప్పారు. డిప్యూటీ తహసిల్దార్ విజయభాస్కర్, డీఆర్‌డీఏ ఏరియా కో ఆర్డినేటర్ కె.లక్ష్మిరెడ్డి, ఈవోపీఆర్డీ ఈదుల రాజశేఖరరెడ్డి, ఏఈలు అల్లూరయ్య, శ్రీకాంత్, అంజిరెడ్డి, వైద్యాధికారి డాక్టర్ షేక్.నాయబ్‌రసూల్, ఎంఈవో పి.ఆంజనేయులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, సర్పంచ్ కర్నాటి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పంట రుణాలు సద్వినియోగం చేసుకోండి

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ సమక్షంలో బాధ్యతలు స్వీకరిస్తున్న ఓబుల్‌రెడ్డి

చీమకుర్తి: చీమకుర్తి విశాల సహకార పరపతి సంఘం ద్వారా అందించే పంట రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ సూచించారు. సొసైటీ నూతన ప్రెసిడెంట్‌గా గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించే కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ రైతులకు పంట రుణాలను గరిష్టంగా రూ.3 లక్షల వరకు, దీర్ఘకాలిక రుణాలను రూ.12 లక్షల వరకు మంజూరు చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ తోపూరి సుబ్బయ్య, కౌన్సిలర్ సోమా శేషాద్రి, నాయకులు బీమన వెంకట్రావు, బడే అయ్యపరెడ్డి, వై.శేషిరెడ్డి, గంగిరెడ్డి రామాంజిరెడ్డి, దొంతు ఆంజనేయులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడు మృతి



సంఘటన స్థలంలో ఖాసింవలి మృతదేహం

మార్కాపురం రూరల్: మండలంలోని రాయవరం రైల్వే బ్రిడ్జిపై డివైడర్‌ను ఢీకొని పెద్దారవీడు మండలం గుండంచెర్లకు చెందిన దూదేకుల ఖాసింవలి (30) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... శనివారం మార్కాపురం నుంచి ఆహారం తీసుకుని రాయవరం గ్రామం అవతల మిత్రుల దగ్గరకు వెళ్తూ ప్రమాదానికి గురయ్యాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురంలోని జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ తెలిపారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

క్లుప్తంగా

యువతి పెళ్లి ఖర్చులకు ఆర్థికసాయం

ఒంగోలు అర్బన్: ప్రపంచ మానవతా దినోత్సవం సందర్భంగా సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పామూరుకు చెందిన షేక్ హబీబా కుటుంబానికి పెళ్లి ఖర్చుల నిమిత్తం శనివారం రూ.15 వేలు ఆర్థికసాయం అందజేశారు. ప్రవాస భారతీయుడు రఘురాం తాటిమల్ల సహకారంతో స్థానిక ట్రస్ట్ కార్యాలయంలో ట్రస్ట్ చైర్మన్ షేక్ షహనాజ్ నగదు అందించారు.

నాడు-నేడు పనులను వేగవంతం చేయాలి

మద్దిపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు రెండో దశ పనులను వేగవంతం చేయాలని ఎంఈఓలు ఎంవీఆర్ ఆంజనేయులు, ఎం.శ్రీనివాసరావు హెచ్ఎంలకు సూచించారు. మండలంలో రెండో దశలో 17 పాఠశాలల్లో జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రాబోయే వారం రోజుల్లో రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులు పర్యటించనున్న నేపథ్యంలో హెచ్ఎంలకు ఆదేశాలు జారీ చేశారు. జీఈఆర్ (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో) సర్వే నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా జేవీకే కిట్ ఉపయోగించే విధంగా చర్యలు తీసుకోవాలని, ఎఫ్ఏ 1 మార్కులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. మధ్యాహ్న భోజనాన్ని ప్రతి విద్యార్థి తినే విధంగా హెచ్ఎం, ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని చెప్పారు.

అల్లూరు 4వ వార్డులో కిరణ్ విజయం



అల్లూరులో ఓట్లు వేసేందుకు బారులుదీరిన ఓటర్లు

అల్లూరు (కొత్తపట్నం): పంచాయతీ ఉప ఎన్నికల్లో భాగంగా అల్లూరు పంచాయతీ 4వ వార్డుకు శనివారం నిర్వహించిన పోలింగ్, కౌంటింగ్‌లో మేక కిరణ్ అనే అభ్యర్థి బెంగుళూరి వేణుపై 3 ఓట్ల మెజార్టీతో విజయం సాధించాడు. వేణుకు 148 ఓట్లు రాగా, కిరణ్‌కు 151 ఓట్లు వచ్చాయి. చెల్లని ఓట్లు 5 రాగా, 1 ఓటు నోటాకు వేశారు. వార్డు మెంబర్ ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. జిల్లా సహాయ ఎన్నికల అధికారి, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, ఈవో ఆర్డీ ఏ బాలచెన్నయ్య, పోలింగ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సింగరాజు వెంకట్రావు జయంతి

ఒంగోలు: వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షునిగా పనిచేస్తూ అనారోగ్యంతో మరణించిన సింగరాజు వెంకట్రావు జయంతి కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం 7 గంటలకు స్థానిక బండ్లమిట్టలో నిర్వహించనున్నట్లు ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సింగరాజు మీనావెంకట్రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథులుగా ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి, తదితరులు హాజరవుతారని, నగరంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

కఠోర దీక్షతో ఉన్నత శిఖరాలు సాధ్యం



వసంతను అభినందిస్తున్న ఎస్పీ మలికాగర్గ్



స్వాతిని సత్కరిస్తున్న నాయకులు

- గ్రూప్-1లో ప్రతిభ చూపిన వసంతను అభినందించిన ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: ప్రణాళికాబద్ధమైన నిరంతర అధ్యయనం, కఠోర దీక్షతో ఉన్నత శిఖరాలకు చేరడం సాధ్యమవుతుందని ఎస్పీ మలికాగర్గ్ పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన ఏపీపీఎస్సీ గ్రూప్-1 ఫలితాల్లో ప్రతిభ చూపి వైద్యారోగ్య శాఖలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఎంపికైన డీఎస్బీ సీఐ ఓగిబోయిన దుర్గాప్రసాద్ కుమార్తె వసంతను జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఎస్పీ అభినందించి మాట్లాడారు. ఇదే పట్టుదలతో సివిల్స్‌లో కూడా సత్తా చాటాలని ఆకాంక్షించారు. వసంతను ప్రోత్సహించిన ఆమె తల్లిదండ్రులను కూడా ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో వసంత తలిదండ్రులు దుర్గాప్రసాద్, సుజాత పాల్గొన్నారు.

సీఐని అభినందించిన ఎస్పీ...

ఒంగోలు టౌన్: పొదిలి ఎస్సైగా విధులు నిర్వర్తిస్తూ సీఐగా పదోన్నతి పొంది ఒంగోలు ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు బదిలీ అయిన కె.మల్లికార్జునరావును ఎస్పీ మలికాగర్గ్ అభినందించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా ఎస్పీని కలిసిన సీఐ మొక్క అందజేశారు. పదోన్నతి అనేది హోదాతో పాటు బాధ్యతను కూడా పెంచుతుందని, అంకితభావంతో పనిచేసి పోలీసు శాఖకు మంచిపేరు తీసుకురావాలని ఎస్పీ సూచించారు.

డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన స్వాతికి సత్కారం

ఒంగోలు: గ్రూప్-1 ఫలితాల్లో సత్తాచాటి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన కొమ్ము స్వాతిని శనివారం స్థానిక ఆమె నివాసంలో మాదిగ సంక్షేమ పోరాట సమితి సభ్యులు కలిసి ఘనంగా సత్కరించారు. పేదలకు సేవలందించాలని ఆకాంక్షించారు. మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సృజన్ మాదిగ, జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య, ఎంఎస్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, సర్పంచ్, సొసైటీ చైర్మన్, విద్యుత్ అధికారులు

ఒంగోలు రూరల్: మండలంలోని కరవది గ్రామంలో విద్యుత్ ఆధునికీకరణ పనులను ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి శనివారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో ప్రకృతి వైపరీత్యాల సమయంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతోందని తెలిపారు. పురాతన స్తంభాలు, తీగలు ఉండటంతో తరచూ అంతరాయం ఏర్పడుతోందన్నారు. ఈ విషయాన్ని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా విద్యుత్ ఆధునికీకరణ పనులకు రూ.5 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఆ నిధులతో ఇప్పటికే కొన్ని గ్రామాల్లో నూతన స్తంభాలు, నూతన విద్యుత్ వైర్లు, కండెన్సర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు వంటివి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటి వలన తుఫాన్‌లు, బలమైన గాలుల సమయంలో సైతం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగదని తెలిపారు. ఆక్వా, ఉప్పు కొఠార్లకు సైతం ఉపయోగం ఉంటుందన్నారు. పనులు పెండింగ్ ఉన్న ప్రాంతాల్లో ప్రస్తుతం ప్రారంభించినట్లు ఎంపీపీ తెలిపారు. స్థానిక సర్పంచ్ డి.కోటేశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మన్నె శ్రీనివాసరావు, కరవది గ్రామ సొసైటీ అధ్యక్షుడు వాకా వెంకటకృష్ణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అంచిపోగు రమేష్‌బాబు, నాయకులు వాకా శ్రీనివాసరెడ్డి, పేరకం సుబ్బారావు, దాకా అంజిరెడ్డి, పందిళ్ల ఆంజనేయులు, దార్ల బాబూరావు, సచివాలయ కన్వీనర్ చప్పిడి సోమశేఖర్, వైఎస్సార్ సీపీ ఎస్టీసెల్ అధ్యక్షుడు నంబూరి రమేష్, నాయకులు మిడసల కృష్ణ, తాళ్లూరి రమేష్, విద్యుత్ కన్‌స్ట్రక్షన్ డీఈఈ కె.అంజిరెడ్డి, ఒంగోలు డీఈఈ ఆర్.మోహన్‌రావు, ఏఈఈ ఆర్.ఆర్.చెన్నారెడ్డి, కన్‌స్ట్రక్షన్ ఏఈఈ రమేష్, కంట్రోల్ అండ్ పేనల్స్ లిమిటెడ్ హైదరాబాద్ మేనేజర్ శ్రీనివాస్, కరవది గ్రామ కార్యదర్శులు నాగేంద్రకుమార్, శ్రీలక్ష్మి, జేఎల్ఎంలు రమేష్, మల్లికార్జున పాల్గొన్నారు.

ఫిజియోథెరపీకి తప్పకుండా హాజరుకావాలి



సహిత విద్య బాలుడితో మాట్లాడుతున్న రమేష్

నాగులుప్పలపాడు: సహిత విద్య కార్యక్రమం ద్వారా విద్యనభ్యసించే విద్యార్థులపై వారి తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు వారిని క్రమం తప్పకుండా ఫిజియోథెరపీకి తీసుకురావాలని సహిత విద్య సమన్వయకర్త రమేష్ తెలిపారు. సహిత విద్యా విధానంలో విద్యనభ్యసిస్తున్న నిడమానూరు గ్రామానికి చెందిన పరుసు వరుణ్‌తేజ్‌తో శనివారం వారి ఇంటి వద్దకు వెళ్లి మాట్లాడారు. తల్లిదండ్రులకు సలహాలు, సూచనలు చేశారు. ప్రతి బుధవారం నాగులుప్పలపాడు భవిత కేంద్రంలో నిర్వహించే ఫిజియోథెరపీకి క్రమం తప్పకుండా తీసుకురావాలని చెప్పారు. అనంతరం బీ నిడమానూరు గ్రామంలో ప్రాథమిక పాఠశాలను సందర్శించి తరాల్ కార్యక్రమంలో విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. ఆయన వెంట ఐఈఆర్టీ మధుబాబు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఫొటోగ్రాఫర్లకు సత్కారం



ఫొటోగ్రాఫర్లను సత్కరిస్తున్న వెంకట్

చీమకుర్తి: వరల్డ్ ఫొటోగ్రఫీ డే సందర్భంగా చీమకుర్తిలోని సీనియర్ ఫొటోగ్రాఫర్లు కంజుల లక్ష్మారెడ్డి, బండి సుబ్బయ్య, గుండా ప్రసాద్‌లను గెలాక్సీ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు కరిచేటి వెంకట్ శనివారం శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఫొటోగ్రాఫర్ల సేవలను కొనియాడారు.

సమస్యలు పరిష్కరించాలని ఫ్యాప్టో నిరసన

ఒంగోలు సిటీ: రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట శనివారం సాయంత్రం ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర నాయకులు వెంకటరావు, శ్రీనివాసరావు, రఘుబాబు, జిల్లా నాయకులు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసరావు, రవి, సువర్ణబాబు, కీర్తి, అశోక్‌బాబు, విజయసారధి, సుబ్బారావు, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం యూత్ అధ్యక్షునిగా రామిరెడ్డి



రామిరెడ్డి

చీమకుర్తి: రెడ్డి సంఘం చీమకుర్తి పట్టణ యూత్ అధ్యక్షునిగా చీమకుర్తికి చెందిన డీ రామిరెడ్డిని నియమించారు. తనను నియమించినందుకు ఏపీ రెడ్డి సంఘ అధ్యక్షుడు నరేష్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డికి రామిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

తిరుమలనాథస్వామికి ప్రత్యేక పూజలు

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన రాజ్యలక్ష్మి సమేత గొడ్రాలికొండ తిరుమలనాథ స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, పంచామృతం, శ్రీచక్రం, కుంకుమ పూజ చేశారు. అనంతరం పట్టు వస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి వారికి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

దేశ భవిష్యత్తుకు ఓటు హక్కే ఆధారం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రవికుమార్

ఒంగోలు రూరల్: దేశ భవిష్యత్తుకు ఓటు హక్కే ఆధారమని ఒంగోలు తహసీల్దార్ కార్యాలయ ఎన్నికల ప్రతినిధి కె.శ్రీదేవి పేర్కొన్నారు. సిస్టమేటిక్ ఓటర్ ఎలక్ట్రో పార్టిసిపేషన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కరవది జూనియర్ కాలేజీలో ఓటు హక్కుపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఒంగోలు తహసీల్దార్ పి.మురళి ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు శ్రీదేవి తెలిపారు. ఓటర్లంతా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకున్న నాడే దేశ భవిష్యత్తు బాగుంటుందన్నారు. ఓటర్లు తాత్కాలిక బహుమతులకు బానిసలు కావద్దన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవికుమార్, డీఎల్‌వో శ్రీలక్ష్మి, ఎలక్షన్ సూపర్‌వైజర్ జగదీష్‌బాబు, బీఎల్‌వోలు వేమా శ్రీలక్ష్మి, శివనాగలీల, నాగలక్ష్మి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, కృష్ణమోహన్, వెంకట్రావు, ధనలక్ష్మి పాల్గొన్నారు.

29 నుంచి శ్రీగిరి పవిత్రోత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఝాన్సీరాణి, సభ్యులు

ఒంగోలు మెట్రో: స్థానిక కొండమీద శ్రీగిరి వెంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలను ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ధర్మకర్తల మండలి ప్రతినిధులు తెలిపారు. శనివారం శ్రీగిరి ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పవిత్రోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. పవిత్రోత్సవాలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆమె కోరారు. పాల్గొనదలచిన భక్తులు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆలయ అర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్యనిర్వహణ ధర్మకర్త సి.వి.రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి, ఆలూరు శ్రీనివాస చరణ్ రాజీవ్, వేదపండితులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠ



స్వామివారి కళ్యాణంలో భక్తులు



గుండ్లసముద్రంలో రాతి ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

మద్దిపూడి: మండలంలోని గుండ్లసముద్రంలో గ్రామస్తులు సహాయ సహకారంతో సుమారు 40 అడుగుల వీరాంజనేయస్వామి రాతి ధ్వజప్రతిష్ఠా మహోత్సం శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు బరూరి శివసుబ్రహ్మణ్య శాస్త్రి ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కార్యక్రమం జరిగింది. స్వాములవారిని ప్రతిమలను ఊరేగించారు.

యరజర్ల కొండపై విద్యార్థుల ట్రెక్కింగ్



ట్రెక్కింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఒంగోలు: ఒక వైపు ఉల్లాసం.. మరోవైపు ఆరోగ్యం అంటూ స్థానిక సాయిబాబా సెంట్రల్ స్కూల్ విద్యార్థులు ఉత్సాహంగా కొండలెక్కారు. శనివారం యరజర్ల కొండ నుంచి ప్రారంభమైన విద్యార్థుల ట్రెక్కింగ్ కొణిజేడు కొండల వరకు సాగింది. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు ట్రెక్కింగ్ తోడ్పడుతుందంటూ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ జీవీ భాస్కర్, సాయినాథుని శృతి, ప్రిన్సిపాల్ ఎం.మహేష్ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చీమకుర్తి: ప్రతిఒక్కరూ మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని నేషనల్ గ్రీన్ కార్ప్స్ సెక్రటరీ ఎస్.సుబ్బారావు పిలుపునిచ్చారు. నేషనల్ గ్రీన్ కార్ప్స్ డే సందర్భంగా శనివారం చీమకుర్తి ప్రభుత్వ హైస్కూల్లో సుబ్బారావు ఆధ్వర్యంలో టీచర్లు, విద్యార్థులు మొక్కలు నాటారు. పర్యావరణాన్ని కాపాడుకోవడంలో మొక్కల పాత్ర అమూల్యమైనదని తెలిపారు. విద్యార్థులందరూ ఇళ్ల వద్ద మొక్కలు నాటాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కేపీ, భక్తులు

మార్కాపురం టౌన్: చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఆలయ పునఃనిర్మాణంలో భాగంగా నిర్మిస్తున్న రంగనాయక స్వామి, ఆండాళ్ అమ్మవార్ల దేవలయాల శంకుస్థాపన కార్యక్రమం శనివారం నిర్వహించారు. టీటీడీ వేద పండితుల ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, దేవస్థానం చైర్మన్ పి.కేశవరావు, మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీ కృష్ణ, ఈవో జి.శ్రీనివాసరెడ్డి, ఏఎంసీ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, విశ్రాంత తహసీల్దార్ ఏవీఎల్ఎన్‌వీ సుబ్బారావు, పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ధర్మకర్తలు నాలి కొండయ్య యాదవ్, కౌన్సిలర్ కొత్త కృష్ణా, ఉభయదాతలున్నారు.

స్మార్ట్‌గా తప్పించుకుంటున్నారు

- ఈ-చలానా తప్పించుకునేందుకు ద్విచక్ర వాహనదారుల ఎత్తులు
- నంబర్లు కనిపించకుండా అభిమాన నాయకుల బొమ్మలు
- ఇప్పటివరకు 6 వేల ఈ-చలాన్ల పెండింగ్, పదికి పైగా వాహనాల సీజ్



నంబర్ ప్లేట్ లేని వాహనం



పోలీస్ పేరుతో ఉన్న స్కూటర్

వేటపాలెం: ఏదైనా నేరం జరిగినప్పుడు నిందితులు వాడిన వాహనాలే విచారణలో ప్రముఖ పాత్ర పోషిస్తాయి. ద్విచక్రవాహనం అంకెలు ఉండాల్సిన చోట కొందరు తమ అభిమాన నాయకుడి చిత్రాలు, తాను పనిచేస్తున్న హోదా పేర్లు వేయించుకుంటుండటం చేస్తున్నారు. చీరాల నియోజకవర్గ చీరాల టౌన్, రూరల్, వేటపాలెం మండలాల పరిధిలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ కానిస్టేబుళ్ల ఉంచి ట్రాఫిక్ ఉల్లంఘనల వాహనాల అంకెలను సెల్‌ఫోన్‌లో బంధిస్తుంటారు. ఆ సమయంలో నంబర్ ప్లేట్లపై కొన్నింటికి అంకెలు లేకపోవడంతో చేసేదేమీ లేక వీధుల్లో ఉన్న సిబ్బంది మిన్నకుండి పోతున్నారు. ఈ-చలానాలు తప్పించుకొనేందుకు వాహన దారులు కొత్త ఎత్తులు వేస్తుండటంతో ట్రాఫిక్ పోలీసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్త రవాణా చట్టం ప్రకారం హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు మార్పు చేస్తే చర్యలు తప్పవని రవాణా, పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ-చలానాలు వేటపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఏడాది 6 వేలు పెండింగ్‌లో ఉన్నాయి. లౌడ్ సైలెన్సర్లు, నెంబర్ ప్లేట్ లేని వాహనాలు 10 వరకు సీజ్ చేశారు.



నంబరు స్థానంలో పోలీస్ పేరుతో ఉన్న బుల్లెట్

నిబంధనలు ఇవి..

రవాణా శాఖ సూచించిన హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి. వెనుక రెండు వరుసల్లో సంఖ్య వేయాలి. వాహనం ముందు భాగంలో నంబర్ ప్లేట్‌పై అక్షరాలు 30 మిల్లీ మీటర్ల ఎత్తులో, అంకెలు 35 మిల్లీ మీటర్ల ఎత్తులో 7 మిల్లీ మీటర్ దూరంలో ఉండాలి. వెనుక బోర్డుపై అక్షరాలు 30 మిల్లీ మీటర్ ఎత్తులో అంకెలు 40 మి.మీ ఎత్తు అంకెల మధ్య 5 మిల్లీమీటర్ల దూరం ఉండాలి. వాహనం సామర్థ్యాన్ని బట్టి నంబర్ ప్లేట్ల కొలతలుంటాయి. వ్యక్తిగత వాహనాలు నంబర్ ప్లేట్లు పూర్తిగా తెలుపు రంగులో, అక్షరాలు నలుపు రంగులో ఉండాలి. రవాణా వాహనాలు (ట్రాన్స్‌పోర్టు) అద్దె ప్రాతిపదికన నడిచే వాహనాలకు నంబర్ ప్లేట్లు పూర్తిగా పసుపు రంగులో ఉండి నలుపు అక్షరాలు ఉండాలి.

ఉల్లంఘనలు ఇలా..

నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు మారుస్తున్న వారి సంఖ్య ఇటీవల పెరిగిపోతోంది. కనిపించని పరిమాణంలో అక్షరాలు రాయించుకుని మిగిలిన భాగంలో బొమ్మలతో రాసిలున్న స్టిక్కర్లతో తిరిగే వాహనాలు సంఖ్య ఎక్కువవుతోంది. కొందరు అంకెల్లో ఏదో ఒకటి చెరిపేయడం. మరి కొందరు ఒకే అంకెను పెద్దగా రాయిచుకుని వాహనాలు నడుతున్నారు. ఇక నంబర్ ప్లేట్ విరిగిపోతే తిరిగి చేసుకోవాలనే ధ్యాసే లేని వాహనదారులు కూడా చాలా మందే ఉన్నారు. వీరందరూ వాహన రిజిస్ట్రేషన్ సమయంలో మాత్రం రవాణా శాఖ అధికారులు సూచించే విధంగా హైసెక్యూరిటీ ప్లేట్లు తీసుకుంటున్నా, తరువాత తమకిష్టమైన విధంగా మార్చుకుంటున్నారు. కొత్తగా వాహనాలు కొన్నవారు తాత్కాలిక రిజిస్ట్రేషన్ టీఆర్ నంబర్‌తో వాహాన్ని నెలల తరబడి మరి కొందరు ఏళ్ల తరబడి తిప్పుతున్నారు. వాహనం కొన్న నెలరోజుల్లోనే శాశ్వత నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేయించు కోవాలనే నిబంధనలు గాలికొదిలేస్తున్నరు.

> **నిబంధనలు పాటించాలి..**
>
> రవాణా శాఖ నిబంధనల ప్రకారం ఏవాహనానికైనా హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు మాత్రమే బింగించుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా మార్చినా, అంకెలు చెరిపేసినా జరిమానాలు తప్పవు. ఈ-చలానాల నుంచి తప్పించుకునేందుకు కొందరు నంబర్ ప్లేట్లను తరకరాలుగా మారుస్తున్నారు. పాత వాహనాలు కొనుగోలు చేసిన వారు తప్పనిసరిగా మీ పేర్లపై బదిలీ చేయించుకోవాలి. లేని పక్షంలో చిక్కుల్లో పడతారు.
>
> – జీ సురేష్, ఎస్సై వేటపాలెం